యథేచ్ఛగా ఇరిగేషన్ స్థలాల కబ్జా

- వాగు, వరద కాలువలను ఆక్రమించి నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- వర్షం పడితే జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు



చంద్రబాబునగర్ వద్ద వరద వాగును ఆక్రమించి చేపడుతున్న పక్కా నిర్మాణాలు

నెల్లూరు రూరల్ : నగరానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తూరు పరిధిలోని వరద కాలువలు, దొంతాలి నుంచి నెల్లూరు చెరువులోకి వెళ్లే వరద వాగు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుని నానాటికి కుచించుకుపోతున్నాయి. ఇక్కడ స్థలాల ధరలు భారీగా పెరగడంతో ఆక్రమణదారులు కాలువలు, వాగును కబ్జా చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించకపోవడంతో పక్కా నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకు సైతం లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆక్రమణలు ఇలా...

దొంతాలి నుంచి నెల్లూరు చెరువులోకి వెళ్లే భారీ వరద వాగు పూర్తిగా ఆక్రమణలకు గురైంది. దీంతో వరదనీరు సజావుగా ముందుకు సాగే అవకాశం లేకుండా పోయింది. శ్రామికనగర్ వద్ద రామకోటయ్యనగర్–బుజబుజనెల్లూరు రహదారిపై భారీ వంతెనను గతంలో నిర్మించారు. తిరుమలనగర్ లేఅవుట్ వద్ద వరద వాగును పూర్తిగా ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. దీంతో వాగులోని నీరు దిగువ ప్రాంతానికి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు తిరుమలనగర్ లేఅవుట్‌కు సమీపంలో ఉన్న శ్రామికనగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో వచ్చి చేరుతోంది. బ్రిడ్జికి దిగువ వైపు వాగుకు ఇరువైపులా నానాటికి ఆక్రమణలు పెరుగుతున్నాయి. వాగు వెడల్పు 60 అడుగులు కాగా ప్రస్తుతం 5 అడుగులకు చేరింది. శ్రామికనగర్, ఎన్‌జీవో లేఅవుట్, చంద్రబాబునగర్, రెవెన్యూ కాలనీ, పోలీస్ కాలనీ, తెలుగుగంగ కాలనీ, శివాజీ కాలనీ, టైలర్స్ కాలనీల మీదుగా వాగు నెల్లూరు చెరువులోకి వెళుతుంది. వాగు ఇరువైపులా ఆక్రమణలకు గురికావడంతో వెడల్పు నానాటికి తగ్గుముఖం పడుతోంది. కుమ్మరిగుంట కాలనీ నుంచి శ్రామికనగర్, ఎన్‌జీఓ లేఅవుట్, చంద్రబాబునగర్ వద్ద వాగులో కలిసే వరద కాలువ కూడా పూర్తిగా ఆక్రమణకు గురైంది. కాలువ ఆనవాళ్లే లేకుండా ఆక్రమించి పక్కానిర్మాణాలు చేపడుతున్నారు. కుమ్మరగుంట కాలనీ నుంచి శ్రామికనగర్, తిరుమలనగర్, రవిచంద్రగిరిజన కాలనీ, కొత్తూరు గిరిజన కాలనీ, నక్కా గోపాల్ నగర్, రామకోటయ్యనగర్, అంబాపురం దళితవాడ ప్రాంతాల మీదుగా అంబాపురం చెరువులోకి వెళ్లే కనుపూరు బ్రాంచ్ కెనాల్‌కు ఇరువైపులా ఆక్రమణలు వెలసి ఉన్నాయి. దీంతో కాలువలో పూడిక తీత పనులు చేపట్టడం కూడా కష్టతరంగా మారింది. దీనికి తోడు రామకోటయ్యనగర్ వద్ద కాలువకు ఇరువైపులా ఉన్న చికెన్, ఇతర దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను అందులో పడేస్తున్నారు. దీంతో వ్యర్థాలతో కాలువ పూడిపోయి ఉంది.

అధికారుల్లో సమన్వయలోపం

వరద కాలువలు, వాగుపై వెలిసిన ఆక్రమణలపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు అధికారులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఫలితం లేదు. రెండు శాఖల అధికారుల్లో సమన్వయలోపం తలెత్తడంతో ఎవరికి వారు తమ బాధ్యత కాదంటూ దాటవేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ కాలువల వద్ద సర్వేజరిపి ఆక్రమణలు గుర్తించాల్సిందిగా పలుమార్లు రెవెన్యూ అధికారులకు నివేదికలు పంపినా స్పందన లేని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఇరిగేషన్ కాలువలు, వాగుల ఆక్రమణలను చూసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖదేనంటూ దాటవేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో లోతట్టు ప్రాంత వాసుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు తిరుమలనగర్, శ్రామికనగర్, చంద్రబాబునగర్ ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆక్రమణలను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



ఎన్‌జీఓ లేఅవుట్ వద్ద ఆక్రమణలతో కుచించుకుపోయిన వరద వాగు



తిరుమలనగర్ వద్ద వరద వాగును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలు

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

కొత్తూరు వద్ద ఉన్న భారీ వరద వాగు, వరద కాలువలపై ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలుమార్లు ఆక్రమణలపై సర్వే నిర్వహించాలని రెవెన్యూ శాఖ అధికారులకు లేఖలు పంపాం. కానీ వారు సర్వే నిర్వహించడంలో జాప్యం చేస్తున్నారు. ఆక్రమణల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, ఈఈ,ఇరిగేషన్ శాఖ

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ(డీఏఎల్‌టీ) నివారణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డిని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్(పీహెచ్‌పీ) జిల్లా శాఖ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అమరేంద్రనాథ్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఏఎల్‌టీ నివారణాధికారి మాట్లాడుతూ పీహెచ్‌పీలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. పీహెచ్‌పీలు ప్రథమచికిత్స మాత్రమే అందించాలన్నారు. కుటుంబ, ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములై ప్రభుత్వానికి, ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందించాలని కోరారు. బదిలీ అయిన డీఏఎల్‌టీ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా పీహెచ్‌పీ కన్వీనర్ శాఖవరపు వేణుగోపాల్, జీ శేషయ్య, వీరయ్య, రాందాసు, ప్రసాద్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నెల్లూరు(బృందావనం): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞానవేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని హరనాథపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు సురమౌళి మాట్లాడుతూ భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువుగా వివరించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానందయోగీశ్వరులు త్రైత సిద్ధాంత భగవద్గీతలో శ్రీకృష్ణుడి నిజభావనను పొందుపరిచారన్నారు. ప్రతిఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను పఠించి శ్రీకృష్ణ పరమాత్మను గురువుగా పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీ నరసింహప్రసాద్, సోమశేఖర్, వెంకటేశ్వర్లు, సుమలత, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



కొడవలూరు : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొడవలూరులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం సమీపించిన తరుణంలో మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకొంటూ సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని గీతామాధురి, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, స్టాఫ్ నర్స్ యాస్మిన్, ఏఎన్‌ఎంలు అనిత, విజయలక్ష్మి, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇందుకూరుపేట : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొత్తూరులో సోమవారం ఆయన పర్యటించారు. రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం వరిలో మోముపిప్పి పురుగును గుర్తించామని, దాని నియంత్రణకు మందులు వాడాలని సూచించారు. పాముపొడ తెగులు మొదటిదశలో ఉందని, దాని నివారణకు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ విజయకుమార్‌నాయక్, అనూష తదితరులు ఉన్నారు.

డిప్యూటీ పారా మెడికల్ అధికారికి డాక్టరేట్

వెంకటాచలం: జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పారామెడికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న భువనగిరి వెంకటసుబ్బయ్యకు విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య డాక్టర్ పి.సుబ్బరామరాజు పర్యవేక్షణలో 'నాలెడ్జ్ అండ్ బిలీవ్స్ ఎబౌట్ ట్రాన్స్‌మిషన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ లింపాటిక్ ఫైలేరియాసిస్ ఇన్ నెల్లూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై వెంకటసుబ్బయ్య పరిశోధనలు సాగించి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు సంబంధించి వెంకటసుబ్బయ్యకు వీఎస్‌యూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వీఎస్‌యూ వీసీ జీఎం సుందవల్లి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కోటి కుంకుమార్చనకు కలెక్టర్‌కు ఆహ్వానం



నెల్లూరు(దర్గామిట్ట): ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న కోటి కుంకుమార్చనకు కలెక్టర్ ఎం హరినారాయణన్‌ను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు సోమవారం ఆహ్వానించారు. కలెక్టర్‌కు దేవదేవేరుల శేషవస్త్రాలు, ప్రసాదాలతో పాటు ఆహ్వానపత్రికలను అందజేసి ఆహ్వానించారు.

నుడా చైర్మన్‌కు సత్కారం



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆషాడ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా శాకంబరి అలంకారాన్ని వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి సహకారం అందించడంపై నుడా చైర్మన్, ఆలయ పాలక మండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్‌ను నవాబుపేటలోని ఆయన కార్యాలయంలో ఉభయదాతలు సోమవారం కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఉభయదాతలు పాదర్తిబాలాజీ, పైడా హేమంత్‌కుమార్, తన్నీరు కిషోర్‌కుమార్, పబ్బిశెట్టి నందకిషోర్, పసుమర్తి కుమార్, సోదరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ ఎం హరినారాయణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయిలో పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, అధికారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. లేఅవుట్లలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు, మోటార్ల ఏర్పాటుకు రూ.14 కోట్లు కేటాయించామని తెలిపారు. సిమెంట్, స్టీలు తీసుకుని పనులు మొదలుపెట్టని లబ్ధిదారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా గృహాలకు రుణాలు పొంది సొంత పనులకు నగదు వాడుకున్న వారిని పిలిపించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో నెల్లూరు కార్పొరేషన్ పనితీరు బాగుందన్నారు. మిగిలిన మండలాల్లోనూ పురోగతి సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ నాగరాజు, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా, డ్వామా పీడీలు రవీంద్ర, వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

స్పందన విజ్ఞప్తులను గడువులోగా పరిష్కరించాలి



విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన విజ్ఞప్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఫోన్ ద్వారా విన్నవించిన సమస్యలను ఆలకించారు. ప్రజల వినతులను సంబంధిత విభాగాధికారులకు తెలియజేసి నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. యెట్ టు, జగనన్నకు చెబుదాం, 1902, స్పందన, ఏపీసేవా పోర్టల్‌ను అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్ లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. స్పందన ఎండార్స్‌మెంట్ అందరికీ అర్థమయ్యేలా ఉండాలని, సెక్షన్లు, టెక్నికల్ విషయాలను పొందుపరచాలన్నారు. స్పందన సమస్యల పరిష్కారం తీరును ప్రత్యేక బృందాలతో నేరుగా అర్జీదారుడితో మాట్లాడి తెలుసుకుంటున్నామన్నారు. స్పందన సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కారం చూపాలన్నారు.

అనాథ బాలల ఆశ్రమానికి రూ.10వేలు వితరణ

నెల్లూరు రూరల్: పొదలకూరురోడ్డు, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి ఉమ్మడిశెట్టి చెంచయ్య, లక్ష్మి దంపతులు అల్లూరు మండలం గొల్లపాళెంలోని శరత్ అనాథ బాలల ఆశ్రమానికి సోమవారం రూ.10వేలు వితరణ చేశారు. ఈ సందర్భంగా చెంచయ్య మాట్లాడుతూ అనాథ ఆశ్రమానికి తమ వంతు తోడ్పాటును ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. బాలలు క్రమశిక్షణతో మెలిగి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

కరోనా సమయంలో అండగా..



కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి(ఫైల్)

నెల్లూరు రూరల్: రూరల్ మండలం, కాకుపల్లి బిట్–1 సచివాలయం పరిధిలోని క్లస్టర్–8లో రాపూరు జ్యోతి వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి తనకు కేటాయించిన గృహాల పరిధిలోని వారికి పింఛన్‌లను అందించడంతో పాటు కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నిత్యం ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన సేవలు అందించారు. నిత్యావసర సరుకులు, కూరగాయలతో పాటు ప్రభుత్వం సాయం రూ.1000 అందజేశారు. దీంతో ఆర్థిక భరోసా లభించిందని వలంటీర్ సేవలపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్ సేవలు అభినందనీయం



కరోనాతో లాక్‌డౌన్ విధించడంతో నిత్యావసరాలకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండేవాళ్లం. ఒక రోజు ఉదయాన్నే వలంటీర్ జ్యోతి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మా ఇంటికొచ్చి రూ.1000 అందజేసింది.పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని చెప్పింది. దీంతో ఎంతో సంతోషించాం. ఆ డబ్బులు మా అవసరాలకు పనికి వచ్చాయి. మా వలంటీర్ సేవలు అభినందనీయం

–ఉప్పల నారయ్య, కాకుపల్లి

నీ కార్యకర్త తప్పు చేస్తే.. నువ్వు చేసినట్లేనా..?

- పవన్ కళ్యాణ్‌పై నగర ఎమ్మెల్యే అనిల్ ధ్వజం



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జనసేన కార్యకర్తపై చేయి వేస్తే నాపై వేసినట్లేనని మహిళా సీఐపైకి దండ యాత్రలా వచ్చి ఏదో ఘనకార్యం సాధించినట్లు రాద్ధాంతం చేయడం సిగ్గుచేటు..నీ కార్యకర్త తప్పు చేస్తే నీవు చేసినట్లేనా అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని మెక్లిన్స్‌రోడ్డు, విరాట్‌నగర్, మస్కట్‌వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ఓ వ్యక్తి తప్పు చేయగా బలహీన వర్గానికి చెందిన మహిళా సీఐ బుద్ధి చెప్పారన్నారు. అందుకు జనసేన కార్యకర్తపై చేయివేస్తే తనపై వేసినట్లేనని యువతను రెచ్చగొడుతూ ఊగిపోతూ పవన్ తిరుపతిలో ర్యాలీ నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఇదంతా చూస్తే ఆయన మహిళలపై కోపంతో ప్రవర్తిస్తున్నారని అర్థమవుతోందన్నారు. ఆయన వేషాలను చూసి రాష్ట్ర ప్రజలు ఇలాంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమా? అని ఆలోచిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా తన మాటలను పవన్ సమర్థించుకోవడం దారుణమన్నారు. ఆయన ఎవరిని ఏదైనా అనొచ్చు..తిరిగి ఎవరైనా ఏదైనా అంటే మాత్రం తాను నిజాయతీపరుడినని ఊగిపోవడం అలవాటైపోయిందన్నారు. పవన్‌కళ్యాణ్ తన ప్రచార రథానికి వారాహి అని అమ్మవారి పేరు పెట్టుకుని ఊగిపోతూ ఇష్టానుసారంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకోవడం తప్ప మీ వల్ల ప్రజలకు ఏమైనా ఉపయోగం ఉందా అని ప్రశ్నించారు. తనను సీఎంను చేయండి అని ఒకరోజు, పొత్తులో తనకు 30 సీట్లు ఇవ్వండని మరోరోజు మాట్లాడడం తప్ప ఏ రోజైనా స్థిరంగా మాట్లాడావా అని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసినా, పొత్తులో పోటీ చేసినా పవన్ కళ్యాణ్ గెలవడం మాత్రం అనుమానమేనన్నారు. అలాంటి వ్యక్తి తమ ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నీతో సినిమా తీస్తూ కోట్లు ఖర్చు చేస్తున్న నిర్మాతల గురించి ముందు ఆలోచించి వాళ్లకు సరిగా కాల్‌షీట్లు ఇస్తే బాగుంటుందన్నారు. సినిమాల్లో ఎంత బాగా నటిస్తారో..బయట కూడా అంతే అద్భుతమైన నటుడు పవన్ అన్నారు. సినిమాలు ఉన్నన్ని రోజులు నాకు అన్ని చిరంజీవేనని, ఆయన లేకపోతే నేను లేను అని చెప్పే పవన్ రాజకీయాల్లోకి వచ్చేసరికి చిరంజీవి పేరును ఏ రోజూ ప్రస్తావించరని, ఆయన తండ్రి కానిస్టేబుల్ అని మాత్రమే చెప్తారన్నారు. చిరంజీవిని చూసే తన సినిమా టికెట్లు అమ్ముడు పోతాయనే విషయాన్ని మాత్రం బయట పెట్టుకోరన్నారు. చిరంజీవి తమ్ముడు కాబట్టే జనాలు నిన్ను చూశారని, నువ్వు పవన్‌గా వచ్చి ఉంటే ఎవరూ నీ సినిమాలు చూసి ఉండరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, 48వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ సిద్దిక్, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం గౌస్, ఎస్పీవీఎస్ మూర్తి సోమవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్ను మార్పు వివరాలు, కొత్త డీఆర్ 2.73 శాతం, పెన్షన్‌దారుల సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో పెన్షనర్స్‌కు రక్తపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్స్ అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

- ఆటోనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. ఆటో నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.
- తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని వీఎంఆర్‌నగర్‌లో 33 కేవీ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. చాణుక్యపురి, వీఎంఆర్ నగర్, ఏవీకే ఎస్టేట్, గోమతినగర్, వీవర్స్‌కాలనీ, ఆర్సీఆర్ నగర్, మహిళా ప్రాంగణం పరసర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.
- బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాద్రి, లెక్చరర్స్ కాలనీ విద్యుత్ ఫీడర్లలో స్కాడా పనులు చేస్తున్నందున ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. మాగుంట లేఅవుట్, డిమార్ట్, కింగ్స్‌కోర్టు, లెక్చరర్స్‌కాలనీ, అన్నమయ్య సర్కిల్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.
- ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళ, బుధవారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగును. పోస్టల్‌కాలనీ, సింహపురికాలనీ, నిప్పోసెంటర్, పోలీస్‌కాలనీ, చంద్రమౌళినగర్, విద్యుత్‌భవన్, ఎన్‌జీఓ కాలనీ, ఏపీ టూరిజం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

టీడీపీ ఆందోళన

నెల్లూరు సిటీ: రాష్ట్రంలో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంపై టీడీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి గాలాజు శివాచారి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. నగరంలోని మద్రాసు బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. ప్రజలపై ధరల భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్చి రవి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.